క్లుప్తంగా

అన్నదానం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శివాలయం వీధిలోని నందిని క్లాత్‌మార్కెట్ సమీపంలో గురువారం పౌర్ణమి సందర్భంగా దత్తాత్రేయ స్వామి చిత్రపటానికి ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం శ్రీ పాదవల్లభ సేవా సంఘం ఆధ్వర్యంలో 500 మందిపైగా భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది.

స్వచ్ఛ భారత్‌పై అవగాహన

ప్రొద్దుటూరు : స్థానిక ఎస్‌సీఎస్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో మండలంలోని చౌటపల్లె గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన స్పెషల్ క్యాంప్‌ను సర్పంచ్ మార్తల లక్ష్మీసునీత ప్రారంభించారు. గ్రామస్తులకు స్వచ్ఛ భారత్, క్లీన్ అండ్ గ్రీన్, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రశేఖర్, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1 ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఏసీ వెంకటరాముడు, విద్యార్థులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోస పోవద్దు

అట్లూరు : పండించిన పంటలు అమ్ముకోవడంలో దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తుందని బద్వేలు వ్యవసాయ డివిజన్ సహాయ సంచాలకులు ఎం.నాగరాజు తెలిపారు. బద్వేలు వ్యవసాయ కార్యాలయంలో గురువారం రైతు భరోసా సహాయకులు, మండల వ్యవసాయ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి సూచనలు, సలహాలు అందజేశారు.

మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా గురుప్రసాద్

పోరుమామిళ్ల : మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా కొప్పరపు గురుప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం మాజీ అధ్యక్షుడు తులసి సుధాకర్, పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు, మాజీ అధ్యక్షుడు మాలెపాటి సత్యనారాయణ ఆధ్వర్యంలో నూతన అధ్యక్షుడు సన్మానించారు.

దరఖాస్తుల ఆహ్వానం

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని గోవిందయ్యమఠం ఆవరణలోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ముఖ్య కార్యనిర్వహణాధికారి సి.శివయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 20 రోజుల వ్యవధిలో దరఖాస్తులను అందజేయాలని కోరారు.

ఆడుదాం ఆంధ్రాలో సత్తా

చాపాడు : మైదుకూరు పట్టణంలోని మేధా డిఫెన్స్ అకాడమీలో గురువారం జరిగిన ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి ఖోఖో, కబడ్డీ పోటీలలో చాపాడు మండల జట్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. ఖోఖోలో మహిళల విభాగంలో అన్నవరం గ్రామానికి చెందిన మహిళ జట్టు ప్రథమ స్థానంలో నిలువగా, పురుషుల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ఇదే క్రమంలో కబడ్డీ పోటీలలో చియ్యపాడుకు చెందిన పురుషుల జట్టు ప్రథమ స్థానంలోని నిలిచింది.

ఘనంగా రూబీ జూబ్లీ వేడుకలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక మోడంపల్లెలోని కేఎంహెచ్ ఫంక్షన్ హాల్‌లో గురువారం మోక్షగుండం వీధిలో ఓంశాంతి భవన్ ప్రారంభించి 40 ఏళ్లు అయిన సందర్భంగా రూబీ జూబ్లీ వేడుకలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి హాజరై మాట్లాడారు. మోక్షగుండం వీధి ఓంశాంతి భవన్ ఇన్‌చార్జ్ పావని బెహన్‌జీ రాజయోగం ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

దువ్వూరు : ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని కానగూడూరు గ్రామంలో రూ.20.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం నవరత్నాలు – పేదలందరికి ఇళ్లు కార్యక్రమంలో భాగంగా కానగూడూరు గ్రామానికి చెందిన 101 మంది మహిళలకు ఇళ్ల పట్టాలు అందించారు. ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, సర్పంచ్ కోటలో బీబీ, ఎంపీటీసీ సుబ్బమ్మ, నాయకుడు సానేపల్లి కిరణ్‌కుమార్‌రెడ్డి, కామనూరు సురేంద్ర, గోపిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, కోగటం వీరారెడ్డి, నల్లగట్ల లక్ష్మిరెడ్డి, డాక్టర్ సురేష్‌బాబు, తహసీల్దార్ రమకుమారి, ఇన్‌చార్జి ఎంపీడీఓ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సెమిస్టర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక గౌతమి మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులు 3, 5 సెమిస్టర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాష్‌రావు తెలిపారు. 5వ సెమిస్టర్ ఈసీఈ విభాగంలో సునీత 98, చందన 94, మనీష 94శాతం మార్కులు, ట్రిపుల్‌ఈ విభాగంలో సంగీత, కుళాయమ్మ 87, జీవన 84శాతం మార్కులు, 3వ సెమిస్టర్ ఈసీఈలో జయశ్రీ, ఐశ్వర్య 88, స్పందన 86, ట్రిపుల్‌ఈలో వాసంతి 92, నాగసాచి 90, సీఎంఈ బిందుశ్రియ 96, హర్షియ 94, స్నేహలత, శ్రీవల్లి 93 శాతం మార్కులు సాధించారు. వీరిని కరస్పాండెంట్ బాబమ్మ, డైరెక్టర్లు నాగూర్, రవీంద్రారెడ్డి, కో డైరెక్టర్ శైలూష అభినందించారు.

రాజకీయ లబ్ధి కోసమే ప్రవీణ్ విషప్రచారం

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : రాజకీయ లబ్ధి కోసమే టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రవీణ్ తనను బలహీనపరిచేందుకు పదే పదే అబద్ధాలతో కూడిన విష ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రొద్దుటూరులో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రవీణ్ కేవలం తనపై విమర్శలు చేయడం పనిగా పెట్టుకున్నారని తెలిపారు. ఈ పట్టణంలో ఏ సంఘటన జరిగినా ఆ సంఘటనలో తన పాత్ర ఉందంటూ విష ప్రచారానికి దిగడంపై ఆయన మండి పడ్డారు. పట్టణంలో దుకాణాలపై ఇన్‌కం ట్యాక్స్ అధికారులు దాడులు చేసినా, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అక్రమ నగదుపై పోలీసులు తనిఖీలు చేసినా తన పాత్ర ఉందంటూ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాడన్నారు. ప్రవీణ్ అబద్ధాలకు అంతే లేకుండా పోయిందని విమర్శించారు. ప్రొద్దుటూరు చరిత్రలో ఇలాంటి రాజకీయ వాతావరణం ఎప్పుడూ లేదని, ప్రవీణ్ కుమార్‌రెడ్డి టీడీపీ ఇన్‌చార్జిగా నియమించినప్పటి నుంచి ఉందన్నారు. బంగారు దుకాణాలపై పోలీసులు తనిఖీ పేరుతో దాడులు జరిగితే వ్యాపారులకు అన్యాయం జరిగిందంటూ మొట్టమొదటగా తానే స్పందించానని అన్నారు. డ్వాక్రా మహిళలు మోసానికి గురైన నగదును ప్రవీణ్‌రెడ్డి చెల్లిస్తానని తెలుపగా మహిళలు ప్రవీణ్ నివాసానికి అడగడానికి వెళితే వారిపై దాడి చేసిన కేసులో టీడీపీ వారితోపాటు తమ వారిపై కూడా పోలీసులు కేసులు నమోదు చేశారన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో ప్రజాస్వామ్యం ఉంది కాబట్టే పోలీసులు తమ వారిపై కూడా కేసు నమోదు చేశారన్నారు. ఇటీవల ప్రవీణ్ అనుచరుడు తిప్పిరెడ్డిపల్లె దస్తగిరి అప్పు పేరుతో మహబూబ్ బాషా అనే వ్యక్తిని కిడ్నాప్ చేస్తే కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. వారిపై అక్రమ కేసులు నమోదు చేస్తారా అంటూ తన అనుచరులతో ప్రవీణ్ పోలీస్ స్టేషన్‌లో రాద్ధాంతం చేశారన్నారు. రాచమల్లు రాజ్యాంగం ఉంటే ప్రతి సంఘటనపై తమ వారిపై కేసులు నమోదు చేస్తారా అని ప్రశ్నించారు. ప్రవీణ్ నిత్యం పత్రికా సమావేశాలతో ప్రత్యర్థులపై విష ప్రచారం చేయడం తప్ప మరొకటి లేదన్నారు. ఇప్పటికైనా ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో పోరాటం చేసి ప్రజా సేవలో నిమగ్నం అయితే నాయకునిగా ఎదుగుతావని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి పాల్గొన్నారు.

మోదీతోనే దేశాభివృద్ధి

మైదుకూరు : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో దేశంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని వక్తలు పేర్కొన్నారు. మైదుకూరులో రాయల కూడలిలో గురువారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సందర్భంగా బహిరంగ సభ నిర్వహించారు. ముందుగా కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించే క్యాలెండర్‌ను అధికారులు, బీజేపీ నాయకులు ఆవిష్కరించారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మాచనూరు సుబ్బరాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో హౌసింగ్ డీఈఈ పాండురంగారెడ్డి , డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున , మండల వ్యవసాయాధికారి లక్ష్మీప్రసన్న , అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి ఆయేషా తదితరులు మాట్లాడారు.. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎల్లారెడ్డి, మాజీ జాతీయ కార్యవర్గ సభ్యుడు బీపీ ప్రతాప్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు ఆర్.రామకృష్ణ, బి.మఠం మండల అధ్యక్షుడు చంద్ర ఓబుళరెడ్డి, మైదుకూరు మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రశాంతి పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన

రాజుపాళెం : రాజుపాళెం మండలం వెలవలి సచివాలయంలో గురువారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం ద్వారా కేంద్ర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షుడు గోపు నరసింహులు మాట్లాడారు. సర్పంచ్ మహబూబ్‌బాషా, ఈఓపీఆర్డీ షాకీర్ ఆలీఖాన్, డాక్టర్ నిఖిల, ఏపీఎం జయరాజ్, ఏఓ శివరామకృష్ణారెడ్డి, హౌసింగ్ ఏఈ శేఖర్, కొర్రపాడు పశువైద్యురాలు లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

నేడు కళాకారులకు గుర్తింపు కార్డులు పంపిణీ



మాట్లాడుతున్న బండారు లక్ష్మీదేవి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వసంతపేటలోని శ్రీచౌడేశ్వరి దేవి తొగటవీర క్షత్రియ కళ్యాణ మండపంలో శుక్రవారం సాయంత్రం కళాకారులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తున్నట్లు ఏపీ నాటక అకాడమి డైరెక్టర్ బండారు లక్ష్మీదేవి పేర్కొన్నారు. గురువారం తన గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాకు 1000 కార్డులు మంజూరయ్యాయని, నియోజకవర్గంలో వంద మంది కళాకారులకు ఈ కార్డులు అందిస్తున్నామన్నారు. ఇదివరకే బద్వేలు, రాయచోటి ప్రాంతాల్లో దాదాపు 700 గుర్తింపు కార్డులు అందించామన్నారు. రంగస్థల, చక్కభజన, కోలాటం, వీధినాటకం, హార్మోని, తబలా, మిమిక్రీ, కీబోర్డు తదితర కళాకారులకు ఈ గుర్తింపు కార్డులను అందచేస్తున్నామన్నారు. ఎవరైనా కళాకారులు గుర్తింపు కార్డుకోసం సెల్ నంబర్ 9849203829కు సంప్రదించాలని కోరారు. సమావేశంలో తొగటవీర క్షత్రియ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ, కోనేటి రామసుబ్బయ్య, కుమార్ పాల్గొన్నారు.

సభావేదిక ప్రారంభించిన డీఈఓ

కలసపాడు : జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 1977–78 సంవత్సర పదవ తరగతి పూర్వ విద్యార్థుల దాతృత్వంతో రూ.5 లక్షలతో నిర్మించిన సభావేదికను గురువారం డీఈఓ రాఘవరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. పూర్వ విద్యార్థులు రూ.5 లక్షల వ్యయంతో సభావేదికను నిర్మించడం అభినందనీయమని తెలిపారు. హెచ్ఎం మెర్సిమాలిని, పూర్వ విద్యార్థులు సత్యనారాయణ, రమణారెడ్డి, నారాయణరావు, రాజ్‌కుమార్, లలిత, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు రుణమాఫీ

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : నియోజకవర్గ పరిధిలోని రూ.50వేల మంది డ్వాక్రా మహిళలకు దాదాపు రూ.160 కోట్ల రుణమాఫీ జరిగిందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. స్థానిక శ్రీనివాసనగర్‌లో గురువారం మెప్మా ఆధ్వర్యంలో వైఎస్సార్ ఆసరా సభ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు కామిశెట్టి బాబు, కోనేటి సునంద, కౌన్సిలర్లు జిలాన్ బాషా, సత్యం , గుర్రం లావణ్య, రాగుల శాంతి, కమాల్‌బాషా, కోఆప్షన్ సభ్యుడు మల్లికార్జున ప్రసాద్, ఏసీపీ మునిరత్నం పాల్గొన్నారు.

అన్నమయ్య ఆడిటోరియం నిర్మాణానికి కృషి

స్థానిక గోల్డెన్ పార్కులో గురువారం ప్రొద్దుటూరు కొరియో గ్రాఫర్స్, ఆర్టిస్టుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు మాట్లాడుతూ మళ్లీ జగన్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక 2029 ఎన్నికల్లోపు అన్నమయ్య ఆడిటోరియం నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, తొగటవీరక్షత్రియ సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ, రవీంద్ర హైస్కూల్ కరస్పాండెంట్ పల్లేటి ప్రభాకర్‌రెడ్డి, రచయిత జింకా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ కాలువ నిర్మాణానికి భూమి పూజ

గోపవరం గ్రామ పంచాయతీ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీ సబ్‌స్టేషన్ వద్ద డ్రైనేజి కాలువ నిర్మాణానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా క్యాలెండర్లను ఆవిష్కరించారు.

అగ్ని ప్రమాద దుకాణాల యజమానులకు ఎమ్మెల్యే భరోసా

స్థానిక పాత మార్కెట్ సమీపంలోని బాలికల హైస్కూల్ వద్ద ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదంలో నష్టపోయిన దుకాణాల యజమానులను ఆదుకుంటానని ఎమ్మెల్యే రాచమల్లు భరోసా ఇచ్చారు. గురువారం ఎమ్మెల్యే సంఘటన స్థలానికి వెళ్లి బాధితులతో మాట్లాడారు. రూ.3లక్షల వరకు నష్టం జరిగిందని బాధితులు తెలి పారు. నష్టాన్ని తాను భరిస్తానని ఎమ్మెల్యే వారికి భరోసా ఇచ్చారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్‌మిల్ ఖాజా, కౌన్సిలర్ నాగేంద్రారెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన ఆడుదాం ఆంధ్ర పోటీలు

ప్రొద్దుటూరు : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో నిర్వహించిన నియోజకవర్గం స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. మహిళల క్రికెట్ సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో, వైవీఎస్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో మహిళల కబడ్డీ సెమీ ఫైనల్, ఫైనల్‌మ్యాచ్‌లు ఉత్సాహంగా జరిగాయి. క్రికెట్ పోటీల్లో మొదటి బహుమతి టీబీ రోడ్డు సచివాలయం-2 జట్టుకు, రెండో బహుమతి గోపవరం సచివాలయం-4 జట్టుకు, మూడో బహుమతి కొర్రపాడు సచివాలయం జట్టుకు వచ్చింది. కబడ్డీలో మొదటి బహుమతి తాళ్లమాపురం, రెండో బహుమతి కుమ్మరపల్లి, మూడో బహుమతి దేవాంగపేట సచివాలయం జట్లు దక్కించుకున్నాయి.

వేలం పాట వాయిదా

ప్రొద్దుటూరు : తాత్కాలిక దినసరి కూరగాయల మార్కెట్, వాహనాల పార్కింగ్, మాంసం, చేపల మార్కెట్ రుసుం వసూలు చేసుకునేందుకు గురువారం నిర్వహించాల్సిన వేలం పాటను వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పాటదారులు ఎవరూ వేలానికి రానందున వాయిదా వేశామని, తిరిగి ఈనెల 27న నిర్వహిస్తామని తెలిపారు.

విశ్రాంత ఉద్యోగుల ధర్నా

ప్రొద్దుటూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆదేశాల మేరకు ప్రొద్దుటూరు విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు ఏరాసు చెన్నారెడ్డి ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ నజీర్ అహ్మద్‌కు వినతి పత్రం సమర్పించారు.

రోడ్డు భద్రతపై అవగాహన

ప్రొద్దుటూరు క్రైం : రోడ్డు భద్రత గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ప్రొద్దుటూరు ప్రాంతీయ రవాణాశాఖ అధికారి మురళీధర్ తెలిపారు. రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా మండలంలోని ఎస్ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీఓ మాట్లాడుతూ ట్రాఫిక్ సిగ్నల్ లైట్లను అనుసరించాలని చెప్పారు. డ్రైవింగ్ చేసేటప్పుడు ఒకే లైన్‌ను అనుసరించాలని, అవసరమైనప్పుడు మాత్రమే ఇండికేటర్‌ను ఉపయోగించాలన్నారు. గడువు తీరిన లైసెన్స్‌తో డ్రైవింగ్ చేయరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ యుగంధర్, ఎంవీఐ నారాయణనాయక్, ఎస్ఐఆర్‌టీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పాండురంగస్ రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటరు దినోత్సవ ర్యాలీ

మైదుకూరు : జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా గురువారం మైదుకూరులో అధికారులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి కౌసర్ బానో మాట్లాడారు.

ఖాజీపేట : ప్రతి ఒక్కరూ తమకు వచ్చిన ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆర్ఐ రవి ఓటర్లకు సూచించారు. బూత్ స్థాయిలో సీనియర్ ఓటర్లను సన్మానించారు.

బద్వేలు అర్బన్ : స్థానిక ఎస్ఆర్ఎస్‌టీ డిగ్రీ కళాశాల నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఆర్డీఓ ఆకుల వెంకటరమణ , బద్వేలు, గోపవరం మండలాల తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, కళాశాల తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరకు అమ్మి లబ్ధి పొందండి



జొన్న పంటను పరిశీలిస్తున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి, వ్యవసాయాధికారులు

ఖాజీపేట : జొన్న రైతులకు ప్రభుత్వం మద్దతు ధర రూ 3,180 గా ప్రకటించింది... ప్రభుత్వానికే అమ్మి రైతులు లబ్ధి పొందాలని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుడు సంబటూరు ప్రసాద్ రెడ్డి రైతులకు సూచించారు. ఖాజీపేట మండలం మిడుతూరు గ్రామంలో జొన్న రైతులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్కెట్‌లో దళారులు కేవలం రూ 2,100 కే కొనుగోలు చేసి రైతులను మోసం చేస్తున్నారని అన్నారు. వారికి అమ్మి రైతులు నష్టపోవద్దని అన్నారు. ప్రభుత్వం కనీస మద్దతు ధర రూ 3,180 గా నిర్ణయించిందని అన్నారు. ఎపీసీడ్ డీఎం అర్జున్‌రావు మాట్లాడుతూ 14శాతం లోపు తేమ శాతం ఉండాలి అలాగే రైతులు పట నమోదు చేసుకుని ఉండాలని సూచించారు. ఎకరాకి 18 క్వింటాళ్లను తీసుకుంటామన్నారు. రైతులు అధికారులను సంప్రదిస్తే మీవద్దకు వచ్చి కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఓ నాగార్జున తోపాటు స్థానిక వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రఘురామిరెడ్డి విస్తృత పర్యటన



చిన్నగురువళూరు రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

చాపాడు : మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి గురువారం చాపాడు మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. ఒకే రోజు ఐదు గ్రామాల్లో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఉదయం 9.30గంటల నుంచి మండలంలోని ఖాదర్‌పల్లెలో నిర్మితమైన వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనం ప్రారంభించారు. అక్కడి నుంచి చిన్నగురువళూరులో నిర్మితమైన వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్, బద్రిపల్లెలో రైతు భరోసా కేంద్రం, సోమాపురంలో రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనాలను ఎమ్మెల్యే రఘురామిరెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, ఎంపీపీ లక్షుమయ్య, మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు, ఏఓ మ్యాగీ, డిప్యూటీ డీఎంహెచ్ఓ మల్లేష్, వైద్యాధికారి రాజేష్‌కుమార్, పీఆర్ డీఈ మల్లేశ్వరరెడ్డి, ఏఈ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

భూమిపూజ..

మండలంలోని సీతారామాపురం గ్రామ సమీపంలో కుందూనదికి అనుబంధంగా ఉన్న గోడేరు వంకపై రూ.30లక్షలతో కల్వర్టు నిర్మించేందుకు బుధవారం ఎమ్మెల్యే రఘురామిరెడ్డి భూమిపూజ చేశారు.

వైఎస్ జగన్‌కు ప్రజలతోనే పొత్తు

చాపాడు : చంద్రబాబు అన్ని పార్టీలతో పొత్తుల కోసం వెంపర్లాడుతున్నారని.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం ప్రజలతోనే పొత్తు పెట్టుకుని ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాడని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. చాపాడు మండలం సోమాపురంలో అభివృద్ధి పనులకు ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నాగిరెడ్డి, ఎంపీపీ లక్షుమయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి, ఉప ఎంపీపీ శుభకరుణమ్మ, హజరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి సమస్యలు రాకుండా చర్యలు

చాపాడు : వేసవి కాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అన్ని గ్రామాలలో జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ సభా భవనంలో మండల అధ్యక్షులు తెలిదేల లక్షుమయ్య ఆధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వారు చర్చించారు. ఈ సమావేశంలో మండల అధికారులు పాల్గొన్నారు.

దర్గాలో ఎమ్మెల్యే ప్రార్థనలు

చాపాడు : మండలంలోని ఖాదర్‌పల్లె గ్రామంలోని పెనుగొండ బాబాఫకృద్దీన్ స్వామి దర్గాలో గురువారం ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. దర్గా పునర్‌నిర్మాణానికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి నిధుల క్రింద రూ.4.50 లక్షలు మంజూరైంది. దీని నిర్మాణ పనులు చేపట్టి త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులకు సూచించారు